కొడైకెనాల్‌లో సీఎం కుటుంబం

● ఐదు రోజుల పాటు విశ్రాంతి

అడయార్, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల కోసం నెల రోజుల పాటు శ్రమించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విశ్రాంతి కోసం కొడైక్కెనాల్ వెళ్ళారు. ఆయన ఐదు రోజుల పాటు అక్కడే విశ్రాంతి తీసుకోనున్నారు. సోమవారం ఉదయం ఆళ్వార్‌పేటలోని తన నివాసం నుంచి కారులో చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరుకుని, విమానంలో మదురై చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఆయన కొడైక్కెనాల్ చేరుకున్నారు. సీఎం స్టాలిన్ వెంట ఆయన కుటుంబ సభ్యులు కూడా వెళ్ళారు. మే 3వ తేదీ వరకు వారంతా అక్కడే ఉంటారు. ఐదు రోజుల పాటు కొడైక్కెనాల్‌లోని పలు పర్యాటక ప్రాంతాలను తన కుటుంబ సభ్యులతో తిలకించిన తర్వాత ఆయన మే 4వ తేదీ చెన్నై తిరుగుపయనమవుతారు. సీఎం కొడైక్కెనాల్ పర్యటన దృష్ట్యా పోలీసులు ముందు జాగ్రతగా గట్టి భద్రత కల్పించారు. 2021లో కూడా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే సీఎం స్టాలిన్ తన కుటుంబ సభ్యులతో కలిసి కొడైక్కెనాల్‌కు విశ్రాంతి కోసం వెళ్ళిన విషయం తెల్సిందే. ఇదిలావుంటే, సీఎం కొడైక్కెనాల్‌లో ఉన్న కారణంగా పర్యాటకులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఎలాంటి ఆంక్షలులేవని ప్రభుత్వ అధికారులు వెల్లడించారు.



మదురై విమానాశ్రయం నుంచి బయటికి వెళ్తున్న స్టాలిన్ దంపతులు

త్వరలో 'ఎయిర్ టాక్సీ' సేవలు!



ప్యారీస్, ఏప్రిల్ 29: గ్రేటర్ చెన్నైలో వచ్చే ఏడాది మార్చి నుంచి ఎగిరే విద్యుత్ టాక్సీ సేవలు ప్రారంభయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీని ద్వారా నగరం నుంచి 14 నిమిషాల వ్యవధిలో శివారు ప్రాంతమైన తాంబరం చేరుకోవచ్చు. నగరానికి చెందిన 'ఈ ప్లాన్' అనే స్టార్టప్ సంస్థ ఎయిర్ టాక్సీలను అత్యాధునిక డిజైన్‌తో రూపొందించింది. ప్రధాన నగరాల్లో నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నివారించే దిశగా మొట్టమొదటగా 26 కిలోల బరువు మోయగల డ్రోన్‌లను తయారుచేసి విక్రయించేందుకు ఈ సంస్థ నిర్ణయించింది. కాగా, ఈ ఎయిర్ టాక్సీ ఉన్న స్థలం నుంచి పైకి ఎగురుతుంది. అలాగే, దిగే సమయంలో కూడా ఎలాంటి కుదుపులుండవు. సహజంగా వాహనాల్లో నగరం నుంచి తాంబరం చేరుకోవాలంటే దాదాపు 60 నుంచి 75 నిమిషాలు అవుతుంది. ఈ ఎయిర్ టాక్సీ అందుబాటులోకి వస్తే 14 నిమిషాల్లోనే తాంబరం చేరుకోవచ్చు. నలుగురు వ్యక్తులు కూర్చొనే విధంగా, డిజైన్ చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ సేవలు వచ్చే ఏడాది మార్చి నెల నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

తారలతో సెల్ఫీలు తీసుకుంటే కఠిన చర్యలు

కానిస్టేబుళ్లకు కమిషనర్ హెచ్చరిక



చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో నేరాలను నిరోధించే దిశగా గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు ఎస్ఐ ర్యాంక్ కంటే దిగువ స్థాయి పోలీసులకు కొన్ని నిబంధనలను విధించారు. ఆ ప్రకారం డ్యూటీ సమయంలో పోలీసులు సెల్‌ఫోన్ వాడకూడదని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రులు సహా వీవీఐపీలకు భద్రత కల్పిస్తున్న సమయంలో కానిస్టేబుళ్లు వారికి భద్రతపైనే దృష్టిసారించాలన్నారు. ఇదే విధంగా విధుల్లో ఉన్న పోలీసులు సినీ హీరోలు, హీరోయిన్లు, ప్రముఖులతో ఫొటోలు, సెల్ఫీలు, ఆటోగ్రాఫ్‌లు తీసుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ హెచ్చరించారు. ఇప్పటికే ఓ సినీ హీరోతో ఫొటో తీసుకున్న మహిళా కానిస్టేబుల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలీసు శాఖలో 35,329 మంది మహిళా కానిస్టేబుళ్లున్నారని, వీరిలో 30 శాతం మంది పురుష కానిస్టేబుళ్లకు దీటుగా విధులను నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించాలని, అప్రమత్తంగా వ్యవహించి, భద్రతా లోపాలను నివారించాలని ఆయన సూచించారు. ఇక రాత్రుల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంలోనూ పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలని, వాహనాలు సులువుగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

కౌంటింగ్ ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 16 బల్లలు

భారీ భద్రతా ఏర్పాట్లు

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లాలోని సెంట్రల్ చెన్నై, సౌత్ చెన్నై, నార్త్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓట్లు లెక్కించే విషయమై ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్ సోమవారం ఉదయం అధికారులతో సమీక్ష జరిపారు. ముందుగా నగరంలోనూ రాణిమేరీ కళాశాల, అన్నావిశ్వవిద్యాలయం, లయోలా కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను ఆయన పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ మూడు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఆయా కంట్రోల్‌రూమ్‌ల నుంచి తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు సక్రమంగానే పనిచేస్తున్నట్లు వారిద్దరూ ధ్రువీకరించారు. రాణీ మేరీ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద రాధాకృష్ణన్ మీడియాతో మాట్లాడుతూ... నగరంలోని మూడు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ప్రతిరోజూ ఆయా ప్రాంతాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసి వెళుతున్నారని, కాపలా కాస్తున్న పోలీసులు, పారా మిలటరీ దళాలు షిఫ్టుల ప్రకారం విధులకు హాజరవుతున్నారని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌ల వెలుపల ప్రత్యేక కంట్రోల్ రూమ్ నుంచి పోలీసు ఉన్నతాధికారులు సీసీ కెమెరాల పనితీరు పరిశీలిస్తుంటారని చెప్పారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే జనరేటర్ల ద్వారా వెంటనే విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. జూన్ నాలుగున కౌంటింగ్ జరగాల్సిన పద్ధతులపై అధికారులతో సమీక్షించినట్లు ఆయన తెలిపారు. ఆ ప్రకారం ఎప్పటిలానే ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని శాసనసభ నియోజకవర్గాల సంఖ్యను బట్టి ప్రతి శాసనసభ నియోజకవర్గంలో పోలైన ఓట్లను 16 బల్లలపై ఉంచి లెక్కిస్తామన్నారు. చోళింగనల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో కౌంటింగ్ బల్లల సంఖ్య పెంచుతామని రాధాకృష్ణన్ వివరించారు. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ మాట్లాడుతూ నగరంలోని కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీసులతో పటిష్ఠమైన భద్రత కల్పించినట్లు చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా పోలీసు అధికారులు 24 గంటల పాటు పరిశీలిస్తుంటారని ఆయన పేర్కొన్నారు.



రాణీమేరీ కళాశాల స్ట్రాంగ్ రూమ్ వద్ద కంట్రోల్ రూమ్ పనితీరును పరిశీలిస్తున్న డాక్టర్ రాధాకృష్ణన్, పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్



ఆలయ మండపం నుంచి బయలుదేరుతున్న మహారథం

దంపతుల దారుణహత్య

● వంద సవర్ల నగల దోపిడీ

● పోలీసుల అదుపులో రాజస్థాన్ యువకుడు



శివన్ నాయర్, ప్రసన్న కుమారి (ఫైల్‌ఫొటో)

అడయార్, ఏప్రిల్ 29: నగర శివారు ప్రాంతమైన ఆవడిలో దంపతులను హత్య చేసి, వారి వద్ద ఉన్న 100 సవర్ల బంగారు నగలను దోపిడీ చేశారు. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే... ఆవడి గాంధీ రోడ్డు రెండో వీధిలో శివన్ నాయర్ (60). ఆయన భార్య ప్రసన్న కుమారి (55) అనేదంపతులు నివసిస్తున్నారు. శివన్ మాజీ సైనికోద్యోగి కాగా, అతడి భార్య కేంద్ర ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ చేశారు. వీరి కుమార్తె విదేశాల్లో ఉండగా, కుమారుడు అదే ప్రాంతంలో సిద్ధ వైద్యం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఈ దంపతులు భోజనం చేసి ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అర్ధరాత్రి సమయంలో తలుపు శబ్దం కావడంతో వారు నిద్రలేచి తలుపు తీశారు. ఒక యువకుడు వైద్యం చేయాలంటూ వారిని నమ్మించి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ తర్వాత ఆ దంపతుల గొంతుకోసి హత్య చేశాడు. వారి కేకలు విన్న ఇరుగుపొరుగు వారు హుటాహుటిన వచ్చి చూడగా దంపతులిద్దరూ రక్తపు మడుగులో పడివున్నారు. వెంటనే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఆవడి డిప్యూటీ కమిషనర్ ఐమన్ జమాల్ సారథ్యంలోని పోలీస్ బృందం అక్కడకు చేరుకుని, మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, సీసీ ఫుటేజీ పరిశీలించారు. పోలీసు జాగిలాలతో పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఇదిలావుంటే, హత్య జరిగిన ప్రదేశంలో పోలీసులకు ఒక మొబైల్ ఫోన్ లభ్యమైంది. దీంతో ఫోన్ ఆధారంగా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మహేష్ అనే యువకుడిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ జంట హత్యలు స్థానికంగా కలకలం సృష్టించాయి.



సెంథిల్ బాలాజీ కేసు వ్యవహారం...

సుప్రీంకోర్టుకు క్షమాపణ చెప్పిన ఈడీ

ప్యారీస్, ఏప్రిల్ 29: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) సుప్రీంకోర్టులో క్షమాపణ చెప్పింది. మనీల్యాండరింగ్ కేసులో రాష్ట్ర మంత్రిగా వ్యవహరించిన సెంథిల్ బాలాజీని గత ఏడాది జూన్ 14న అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు, ఆయనపై న్యాయస్థానంలో 3,000 పేజీలతో కూడిన చార్జిషీటు దాఖలుచేశారు. ఈ నకలును న్యాయస్థానం సెంథిల్ బాలాజీకి అందజేసింది. ఈ కేసులో బెయిలు కోరుతూ సెంథిల్ బాలాజీ తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సోమవారం జరిగిన విచారణకు హాజరైన సెంథిల్ బాలాజీ తరఫు న్యాయవాది, ఈడీ అధికారులు ఉద్దేశపూర్వకంగా ఈ కేసు విచారణ సాగదీస్తున్నారని వాదించారు. అనంతరం ఈడీ తరపున దాఖలుచేసిన అఫిడవిట్‌లో, సెంథిల్ బాలాజీ కేసుకు సంబంధించి ఆలస్యంగా అఫిడవిట్ దాఖలుచేసినందుకు క్షమాపణ కోరారు. ఈ వ్యవహారంలో తాము ఉద్దేశపూర్వకంగా విచారణ సాగదీయలేదని ఈడీ వివరించింది. దీంతో ఇరుతరపు వాదనల అనంతరం కేసు తదుపరి విచారణ మే 6వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదావేసింది.

నేత్రపర్వంగా పార్థసారథి స్వామి మహారథోత్సవం

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం మహారథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఈ నెల 22న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వివిధ వాహనాల్లో పార్థసారథి స్వామివారు ఊరేగి భక్తులను అనుగ్రహిస్తున్నారు. గత శని, ఆదివారాల్లో అద్దాల పల్లకీలో, గజవాహనంలో స్వామివారు ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. ఈ నేపథ్యంలో బ్రహోత్మత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం సోమవారం ఉదయం ప్రారంభమైంది. ముందుగా రుక్మిణీ సమేత పార్థసారథిస్వామి వారికి ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం ఉదయం ఏడు గంటలకు ఆలయం ముందున్న రథమండపం వద్ద అలంకరించిన మహారథంలోని ప్రత్యేక పీఠంపై సర్వాలంకరణభూషితులైన పార్థసారథిస్వామిని ఆశీనులు కావించారు. ఆలయ పండితులు, అర్చకులు, వైష్ణవ పండితులు, అధికారులు ప్రత్యేక పూజలు చేసి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆ తర్వాత ఈ వేడుకల్లో పాల్గొనేందుకు విచ్చేసిన వేలాదిమంది భక్తులు రథానికి ఇరువైపులా ఉన్న మోకుతాళ్ళను పట్టుకుని లాగారు. రథానికి ముందు వైష్ణవ పండితులు స్వామివారిని కీర్తిస్తూ భజన గీతాలను ఆలాపించారు. మంగళవాయిద్యాలు, భక్తులు గోవిందనామ స్మరణ నడుమ ఈ రథాన్ని నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా ఆలయ చతుర్మాడ వీధుల్లో నివసిస్తున్న భక్తులు తమ వాకిళ్ళను శుభ్రం చేసి రంగవల్లులతో తీర్చిదిద్దారు. దారిపొడవునా స్థానికులు రథారూఢులైన పార్థసారథి స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. సుమారు గంటకు పైగా ఈ రథోత్సవం కొనసాగింది. మాడవీధుల్లో ఊరేగిన తర్వాత మహారథం ఆలయం ముందున్న రథమండపానికి చేరింది. ఈ వేడుకల్లో వేలది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించారు. రథం ఊరేగింపు జరిగిన మార్గాలలో భక్తజన సంఘాలు మజ్జిగ, శీతలపానీయాలను పంపిణీ చేశాయి.



రథం ముందు కీర్తనలు ఆలాపిస్తున్న వైష్ణవపండితులు



శ్రీకృష్ణుడి వేషంలో నృత్యం చేస్తున్న భక్తుడు

సంచార జాతుల్లో కొత్త రకం డీఎన్‌ఏ!

● పిన్నవయస్సులోనే గుండెపోట్లు, కీళ్ళ నొప్పులు



చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లోనూ, పరిసర జిల్లాల్లోనూ సుగాలీలు తదితర సంచార జాతులకు చెందినవారిలో కొత్త రకం డీఎన్‌ఏ ఉన్నట్లు చెన్నై స్టాన్లీ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి బయోకెమిస్ట్రీ విభాగం నిపుణులు కనుగొన్నారు. ఇటీవల సుగాలీలకు చెందిన ప్రజలతో పరిశోధన చేశారు. ఆ పరిశోధనలో వారి దేహంలో కొత్త రకం డీఎన్‌ఏను నిపుణులు గుర్తించారు. ఈ కొత్తరకం డీఎన్‌ఏ వల్ల అల్‌కాపోటానూరియా లేదా నలుపురంగులో మూత్రవిసర్జనకు సంబంధించిన వ్యాధి కలిగిస్తుందని వెల్లడించారు. ఈ కొత్త రకం డీఎన్‌ఏపై తదుపరి పరిశోధనలు కూడా కొనసాగుతాయని బయోకెమిస్ట్రీ నిపుణులు తెలిపారు. స్టాన్లీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో మూడు రోజులపాటు జరిగిన బయోకెమిస్ట్రీ సదస్సులో ఈ కొత్త రకం డీఎన్‌ఏపై సమగ్రంగా చర్చలు కూడా జరిపారు. ఆ సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, నిపుణులు కూడా కొత్త రకం డీఎన్‌ఏ కారణంగా చిన్నవయస్సులోనే కీళ్ళ నొప్పులు, గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించారు. ఈ డీఎన్‌ఏ ఉన్నవారి మూత్రం నలుపురంగులో రావడం లేదా విసర్జించిన మూత్రం గాలిసోకగానే నలుపురంగులోకి మారడం జరగుతాయన్నారు. వంశపారంపర్యంగా వచ్చే మార్పుల కారణంగానే ఈ కొత్త రకం డీఎన్‌ఏ ఏర్పడుతుందని, ఆ డీఎన్‌ఏను ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తే భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రావని వైద్యనిపుణులు తెలిపారు.



మండే సూరీడు

15 ప్రాంతాల్లో 42.2 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

పెరంబూర్, ఏప్రిల్ 29: రాష్ట్రంలో సోమవారం 15 ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రత సెంచరీ దాటింది. ఈరోడ్‌లో అత్యధికంగా 42.2 డిగ్రీలు (108 డిగ్రీ ఫారన్ హీట్), నమోదైంది. ఇక, రాజధాని నగరం చెన్నైలో 37.7 డిగ్రీలు (100 డిగ్రీ ఫారన్ హీట్) ఎండ తీవ్రత నమోదైంది. దేశంలో పలు ప్రాంతాల్లో ఎండ తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. ఏప్రిల్ నుంచి పలు ప్రాంతాల్లో వడగాలులు కూడా వస్తున్నాయి. రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతల కన్నా 2 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో సోమవారం తిరుపత్తూర్‌లో 107.6 డిగ్రీల ఫారన్‌హీట్, సేలంలో 106.88, వేలూరులో 106.7, కరూర్ పరమత్తిలో 105.8, ధర్మపురిలో 104.9, తిరుచ్చిలో 104.54, మదురై విమానాశ్రయంలో 104.36, తిరుత్తణిలో 104.18, మదురై నగరం, తంజావూరుల్లో 104, కోవైలో 103.64, నామక్కల్‌లో 102.2, పాళయంకోటలో 101.3 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సమాచార దర్శిని

జిల్లా కోర్టుల్లో ఉద్యోగావకాశాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కోర్టుల్లో ఖాళీగా ఉన్న 2,329 పోస్టుల భర్తీకి మద్రాసు హైకోర్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎగ్జామినర్, రీడర్, సీనియర్ బాలిఫ్, జూనియర్ బాలిఫ్, ప్రాసెస్ సర్వర్, ప్రాసెస్ రైటర్, జెరాక్స్ ఆపరేటర్, డ్రైవర్, కాపీయిస్ట్ అటెండర్, ఆఫీసర్స్ స్టాఫ్, పారిశుద్ధ్య కార్మికులు, గార్డెనర్, నైట్ వాచ్‌మెన్, వాటర్‌మెన్ తదితర పోస్టులకు టెన్త్, ఆపై చదువుకున్న 32 ఏళ్లలోపున్న వారు www.mhc.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో మే 27వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రార్ సెల్వనాథన్ తెలిపారు.

చెన్నై-తిరుపతి వందే మెట్రోరైలు ట్రయల్ రన్

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: చెన్నై-తిరుపతి మధ్య వందే మెట్రో రైళ్లు నడిపేందుకు రెండు నెలలు ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఇదివరకే వందే భారత్ రైళ్లు అందుబాటులో ఉండగా, 200 కి.మీ పరిధిలో ఉన్న నగరాలను అనుసంధానిస్తూ ఈ ఏడాది వందే మెట్రో రైళ్లు నడిపేందుకు భారత రైల్వే బోర్డు నిర్ణయించింది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ఈ ఏడాది చివరిలోగా ఈ రైలు అందుబాటులోకి తీసుకురానున్నామని, ఒకటి, రెండు నెలల్లో వీటి ట్రయల్ రన్ ప్రారంభించనున్నామన్నారు. ఒక వందే మెట్రోరైలు మూడు యూనిట్లు ఉంటాయని, ఒక యూనిట్ నాలుగు పెట్టెలు కలిగి ఉంటుందని తెలిపారు. మొదట 12 పెట్టెలతో నడిపి అవసరమైతే 16 పెట్టెలతో నడుపుతామన్నారు. మొదట ఏ మార్గంలో ఈ రైళ్లు నడపాలన్న ఖరారు కాలేదని, అయినప్పటికీ, ఢిల్లీ- రేవారి రూట్‌లో మొదటి మెట్రో నడిపే అవకాశాలున్నాయని తెలిపారు. అలాగే, చెన్నై-తిరుపతి మధ్య నడిపే మెట్రోరైళ్ల ట్రయల్ రన్ రెండు నెలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా గిండి, వేళచ్చేరి ప్రాంతాల పరిధిలోని తిల్లైగంగా నగర్, నంగనల్లూర్, పల్లవన్‌తాంగల్, జీవన్ నగర్, సంజయ్‌గాంధీ నగర్, వేళచ్చేరి, ఆదంబాక్కం, ఆండాళ్ నగర్, వానవుంపేట, బృందావన్ నగర్, మహాలక్ష్మీ నగర్, శాంతి నగర్, పుళిదివాక్కం, ఉల్లగరం, ఏజీఎస్ కాలనీ (వేళచ్చేరి వెస్ట్), ఈబీ కాలనీ, మోహనపురి, ఆదంబాక్కం న్యూ కాలనీ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

10న టెన్త్ ఫలితాలు విడుదల

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: టెన్త్ పరీక్షా ఫలితాలు మే 10వ తేది విడుదల చేసేందుకు పరీక్ష శాఖ నిర్ణయించింది. టెన్త్ మూల్యాంకనం పూర్తయి, మార్కుల పరిశీలన జరుగుతోంది. ప్లస్ టూ పరీక్షా ఫలితాలు మే 6వ తేది విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల శాఖ ప్రకటించింది. అలాగే, టెన్త్ ఫలితాలు 10వ తేది విడుదల చేయాలని నిర్ణయించింది.

షోలింగనల్లూర్-మేడవాక్కం మెట్రో ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: మాధవరం-షోలింగనల్లూర్ మార్గంలో మేడవాక్కం మెట్రో ఫ్లై ఓవర్ పనులు ప్రారంభమయ్యాయి. నగరంలో రెండో విడత పథకంలో మూడు మార్గాల్లో మెట్రోరైలు పనులు జరుగుతున్నాయి. మేడవాక్కం ప్రాంతంలో ఇదివరకే నిర్మించిన స్తంభాలపై ఫ్లై ఓవర్ నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. మొత్తం 44.6 కి.మీ మేర ఈ ఫ్లై ఓవర్ పనులు జరుగనున్నాయి.

మామిడి పండ్ల సీజన్ ప్రారంభం

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: రాష్ట్రంలో, పుదుచ్చేరిలో మామిడి పండ్ల సీజన్ ప్రారంభమైంది. సముద్రతీర ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటల్లో పండ్లు, కాయల కోసం వ్యాపారులు నెలకు ముందే లీజు తీసుకున్నారు. అక్కడి నుంచి తీసుకొచ్చిన పండ్లు, కాయలు నగరాల్లో విక్రయిస్తున్నారు. ఒక కిలో ఇమామ్ పసంద్ రూ.200, బంగినపల్లి రూ.150, కిలిముక్కు రూ.100కు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

నేడు పనిచేయనున్న వండలూరు పార్క్

పెరంబూర్, ఏప్రిల్ 29: స్థానిక వండలూరు జూలాజికల్ పార్క్ మంగళవారం పనిచేస్తుందని పార్క్ నిర్వాహకులు తెలిపారు. ఈ పార్కు ప్రతి మంగళవారం సెలవు. ప్రస్తుతం వేసవి సెలవుల కారణంగా ప్రజలు అధికంగా పార్క్‌కు వస్తుండడంతో, మంగళవారం యధావిధిగా పార్క్ పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు కాట్పాడి నుంచి కోవై, మైసూరు రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 29: కాట్పాడి సమీపంలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా మంగళవారం చెన్నై సెంట్రల్ నుంచి కోయంబత్తూర్, మైసూరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్ల కాట్పాడి వరకు మాత్రమే నడువనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.12680 కోయంబత్తూర్-డా.ఎంజీఆర్ సెంట్రల్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, నెం.12610 మైసూరు-డా.ఎంజీఆర్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు చెన్నైకి బదులుగా కాట్పాడి వరకు మాత్రమే నడువనున్నాయి.
- నెం.12679 డా.ఎంజీఆర్ సెంట్రల్-కోయంబత్తూర్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 2.35 గంటలకు బయల్దేరేందుకు బదులుగా సాయంత్రం 4.15 గంటలకు కాట్పాడి నుంచి బయల్దేరనుంది.
- నెం.12607 డా.ఎంజీఆర్ సెంట్రల్- బెంగళూరు లాల్‌బాగ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరేందుకు బదులుగా కాట్పాడి నుంచి సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరనుంది.

అంకిత్ తివారీ కేసు విచారణ జూలై 18కు వాయిదా

అడయార్, ఏప్రిల్ 29: ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అంకిత్ తివారీపై తమిళనాడు రాష్ట్ర ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసు విచారణ సీబీఐకు మార్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జూలై 18వ తేదీకి సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. దిండిగల్ ప్రభుత్వ వైద్యుడు సురేష్ బాబుపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు వీలుగా ఆయన వద్ద రూ.20 లక్షలు లంచం తీసుకుంటూ ఈడీ అధికారి అంకిత్ తివారీ పట్టుబడ్డాడు. ఈ కేసు విచారణ దిండిగల్ కోర్టులో సాగుతుంది. అయితే, ఈ కేసు విచారణను ఏసీబీ నుంచి సీబీఐకు మార్చాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలుకాగా, దీనిపై న్యాయమూర్తులు సూర్యానంద్, కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఇరువర్గాల వాదనలు ఆలకించిన ధర్మాసనం తదుపరి విచారణను జూలై 18వ తేదీకి వాయిదా వేసింది.

ప్రొఫెసర్ నిర్మలాదేవి దోషే

- శ్రీవిల్లిపుత్తూర్ కోర్టు
- నేడే తీర్పు

ప్యారీస్, ఏప్రిల్ 29: విద్యార్థినులను తప్పుడు మార్గంలోకి నెట్టిన వ్యవహారంలో అరుప్పుకోటకు చెందిన ప్రొఫెసర్ నిర్మలాదేవి దోషేనని శ్రీవిల్లిపుత్తూర్ మహిళా కోర్టు నిర్ధారించింది. ఈ కేసు తీర్పు మంగళవారం వెల్లడించనున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. కాగా, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న మదురై కామరాజర్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మురుగన్, పరిశోధక విద్యార్థి కరుప్పుస్వామిలను నిర్దోషులుగా ప్రకటించిన న్యాయస్థానం, వారిని విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. వివరాల్లోకి వెళితే... విరుదునగర్ జిల్లా అరుప్పుకోటలోని దేవాంగర్ కళాశాలలో గణిత విభాగం ప్రొఫెసర్ నిర్మలాదేవి విద్యార్థినులను తప్పుడు మార్గంలోకి నెట్టేందుకు యత్నించారనే ఫిర్యాదు ఆధారంగా 2018వ సంవత్సరం ఆమెపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఆమెకు సహకరించిన మురుగన్, కరుప్పుస్వామిలపై కూడా కేసు నమోదుచేసి ఆ ముగ్గుర్నీ అరెస్ట్‌చేసి బెయిలుపై విడుదల చేశారు. ఈ వ్యవహారంలో ప్రొఫెసర్ నిర్మలాదేవిని ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు. ఇదిలా ఉండగా, ఈ కేసును సీబీసీఐడీకి న్యాయస్థానం బదిలీ చేసింది. ఎస్పీ రాజేశ్వరి నేతృత్వంలోని దర్యాప్తు బృందం ఈ కేసుకు సంబంధించి సుమారు 1,160 పేజీల చార్జిషీటును న్యాయస్థానంలో దాఖలుచేసింది.


ప్రొఫెసర్ నిర్మలాదేవి

శుక్రవారం ఈ కేసు తీర్పు ఉంటుందని న్యాయస్థానం ప్రకటించడంతో ఆ రోజు జరిగిన విచారణకు నిర్మలాదేవి మినహా మిగతా ఇద్దరు హాజరయ్యారు. దీంతో సోమవారం న్యాయమూర్తి భగవతి అమ్మాళ్ సమక్షంలో హాజరైన నిర్మలాదేవి తరపు న్యాయవాది సురేష్ నెపోలియన్, శిక్ష వివరాలు మంగళవారం ప్రకటించాలని, తీర్పు కూడా ఆ రోజే చెప్పాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మలాదేవి తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దీంతో మంగళవారం తీర్పు వెలువరించనున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

ట్రస్టీల నియామకం ఓ సుదీర్ఘ ప్రక్రియ

- సుప్రీం కోర్టుకు తెలిపిన సర్కారు

అడయార్, ఏప్రిల్ 29: రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆలయాలకు ట్రస్టీల నియామకం ఒక సుదీర్ఘ ప్రక్రియ అని, ఇప్పటికే ఆరు వేల ఆలయా కు ట్రస్టీలను నియమించినట్టు సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. హిందూ ధర్మపరిషత్ సంస్థకు చెందిన టీఆర్ రమేష్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆలయాలకు సంబంధించి ట్రస్టీల నియామకంపై ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. పైగా, నియమించాలన్న ఆలోచన కూడా చేయడం లేదని, అందువల్ల ప్రభుత్వ ఆలయాలకు ట్రస్టీలను నియమించేలా ఆదేశించాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై న్యాయమూర్తి ఏఎస్ బోపన్న, సంజీవ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఆ సమయంలో ప్రభుత్వం తరపున హాజరైన అడ్వకేట్... రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 38 వేల ఆలయాలున్నాయని, ఇందులో ఆరు వేల ఆలయాలకు ట్రస్టీలను నియమించినట్టు తెలిపారు. ట్రస్టీల నియామకం ఒక సుదీర్ఘ ప్రక్రియ అని , కొంత సమయం కావాలని కోరారు. ఈ వాదనలను ఆలకించిన ధర్మాసనం ట్రస్టీల నియామకంపై ప్రభుత్వ చర్యను సమర్థిస్తూ, గడువు ఇచ్చింది.

సైబర్ క్రైం అవగాహనపై ఆడియో

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: రాష్ట్రంలో పెరుగుతున్న 24 రకాల సైబర్ క్రైం మోసాలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసేందుకు రాష్ట్ర సైబర్ క్రైం పోలీసులు ఆడియో రూపొందించారు. ప్రజలకు ఎంత అవగాహన కల్పించినప్పటికీ, సైబర్ క్రైం నేరాలకు పాల్పడేవారి నుంచి లక్షల రూపాయలు కోల్పోతున్నారని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా తక్కువ ధరకే వస్తువులు లభిస్తున్నాయని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఛీటింగ్ ముఠాకు ఓటీపీ నెంబరు, ఏటీఎం కార్డు నెంబర్లు వంటివి చెబుతున్నారని, వీటి గురించి అవగాహన కల్పించేందుకు రూపొందించిన ఆడియో త్వరలో యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయనున్నామని తెలిపారు.

రామచంద్రలో స్పెషల్ కిడ్స్ కోసం సమ్మర్ క్యాంపు

అడయార్, ఏప్రిల్ 29: శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో స్పెషల్ కిడ్స్ కోసం వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. మే 2 నుంచి 20వ తేదీ వరకు ఈ క్యాంపు కొనసాగుతుంది. ఆర్ట్, పెయింటింగ్, డ్రామా, వీడియో గేమింగ్, స్టోరీ టెల్లింగ్, డ్యాన్స్, పప్పెట్ షో, మ్యూజిక్, క్రియేటివ్ మూమెంట్ థెరపీస్, చార్ట్ వర్క్స్, ఒరిగామి, సింపుల్ సైన్స్, ఫైన్ మోటార్ స్కిల్స్ కులినరీ, స్పోర్ట్స్ వంటి అంశాలపై ఈ క్యాంపు నిర్వహించనున్నారు. బదిరుల కోసం ఏర్పాటు చేయనున్న ఈ శిబిరంలో సాధారణ చిన్నారులు కూడా పాలుపంచుకోవచ్చు. ఈ శిబిరంలో పాల్గొనదలచిన చిన్నారుల్లో స్పెషల్ కిడ్స్ రూ.3 వేల, ఇతరులు రూ.4 వేలు చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తమ పేర్లను నమోదు చేసుకునేందుకు కె.సుజాతను 36001 56665, ఆర్.నళినిని 98408 32457 అనే మొబైల్ నంబర్లలో సంప్రదించవచ్చు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ


కృత్రిమ కాళ్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 29: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాధితులకు కృత్రిమ కాళ్లు అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 9 మంది దివ్యాంగులకు రూ.8,16,731 విలువైన కృత్రిమ కాళ్లను కలెక్టర్ సుబ్బులక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.పాపాత్తి, వైద్య కళాశాల సూపరింటెండెంట్ రతి తిలకమ్ సహా పలువురు పాల్గొన్నారు.

9 తరగతి పరీక్షలకు గైర్హాజరైతే మెడికల్ సర్టిఫికెట్ తప్పనిసరి

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: తొమ్మిదో తరగతి సంవత్సరాంత పరీక్షలకు హాజరు కాని విద్యార్థులు మెడికల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర పాఠశాల విద్య పాఠ్య ప్రణాళిక ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఆల్ పాస్ విధానం అమలులో ఉంది. తొమ్మిదో తరగతి విద్యార్థులకు కొన్ని నిబంధనలను పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. వీరికి సంవత్సరాంత పరీక్షా ఫలితాల ఆధారంగానే ఉత్తీర్ణత ప్రకటిస్తారు. ఈ పరీక్షకు హాజరుకాని విద్యార్థులు తప్పనిసరిగా మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాలని జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

రోడ్లపై బీడీ, సిగరెట్ ముక్కలు వేయొద్దు

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: రోడ్ల పక్కన బీడీ, సిగరెట్ ముక్కలు పారవేయకూడదని అగ్నిమాపక, అధికారులు విజ్ఞప్తి చేశారు. వేసవి కావడంతో సులభంగా నిప్పంటుకొనే వస్తువులు ఇళ్లల్లో ఉంచొద్దని, గుడిసెల సమీపంలో చెత్తకుప్పలు కాల్చరాదన్నారు. అలాగే, రోడ్ల పక్కన, పంట పొలాల్లో బీడీ, సిగరెట్ ముక్కలు విసిరి వేయకూడదని తెలిపారు.

మద్యం, మత్తుకు దూరం మీసల్ గ్రామం

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: రామనాథపురం జిల్లా ముదుకొళత్తూర్ సమీపంలోని మీసల్ గ్రామంలో మద్యం, మత్తు పదార్థాలకు నిషేధం విధించారు. ఈ గ్రామంలో 300లకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన వారి వల్ల అప్పుడప్పుడూ కొన్ని సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించేలా గ్రామస్తులంతా ఓ తీర్మానం ఆమోదించారు. మత్తు పదార్థాలు, మద్యం వినియోగం నిషేధించడంతో పాటు ఉల్లంఘించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు. దీనికి సంబంధించి ఆ గ్రామ బస్టాండ్ సమీపంలో మద్యం, మత్తు పదార్థాలు నిషేధ ప్రాంతంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.

కోవై రైల్వేస్టేషన్‌కు రూ.325 కోట్ల ఆదాయం

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: కోయంబత్తూర్ రైల్వేస్టేషన్‌కు రూ.325 కోట్ల ఆదాయం లభించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. దక్షిణ రైల్వేలో గత ఆర్థిక సంవత్సరం ఎక్కువ ఆదాయం ఆర్జించిన పది ప్రధాన రైల్వేస్టేషన్ల వివరాలను విడుదల చేశారు. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ రూ.1,216 కోట్లతో మొదటి స్థానం, చెన్నై ఎగ్మూర్ రూ.564 కోట్లతో రెండవ స్థానం, రూ.325 కోట్లతో కోయంబత్తూర్ రైల్వేస్టేషన్ మూడో స్థానంలో నిలిచింది. తిరువనంతపురం సెంట్రల్ రూ.263 కోట్లు, తాంబరం రూ.234 కోట్లు, ఎర్నాకుళం రూ.227 కోట్లు, మదురై 208 కోట్లు, కోలికోడ్ రూ.179 కోట్లు, తిరుచ్చూర్ రూ.156 కోట్లు, తిరుచ్చి రైల్వేస్టేషన్ రూ.155 కోట్ల ఆదాయం గడించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

పీఎంకే అనుబంధ సంఘాల సమావేశాలు వాయిదా

పెరంబూర్, ఏప్రిల్ 29: పీఎంకే అనుబంధ సంఘాల సమావేశాలు వాయిదాపడినట్లు ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించేందుకు ఈనెల 2,3,4 తేదీల్లో వరుసగా పీఎంకే యువజన విభాగం, విద్యార్థి విభాగం, ఐటీ విభాగం నిర్వాహకుల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో సమావేశాలు వాయిదావేసినట్లు, తదుపరి నిర్వహించే తేదీలు త్వరలో వెల్లడిస్తామని ఆపార్టీ తెలిపింది.

2 నుంచి తిరువణ్ణామలై వరకు సబర్బన్ రైలు

పెరంబూర్,ఏప్రిల్ 29:చెన్నై బీచ్ నుంచి వేలూరు కంటోన్మెంట్‌కు వెళ్లే సబర్బన్ రైలు ఈ నెల 2వ తేది నుంచి తిరువణ్ణామలై వరకు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. తిరువణ్ణామలైలో తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరే సబర్బన్ రైలు చెన్నై బీచ్ రైల్వేస్టేషన్‌కు ఉదయం 9.50 గంటలకు చేరుతుంది. అలాగే, చెన్నై బీచ్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయల్దేరి అర్ధరాత్రి 12.05 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది.

రేపు తిరువొత్తియూర్‌లో గురుపెయర్చి పూజలు

ప్యారీస్, ఏప్రిల్ 29: స్థానిక తిరువొత్తియూర్‌లో ప్రసిద్ధిచెందిన దక్షిణా మూర్తి ఆలయంలో మే 1వ తేది సాయంత్రం గురుపెయర్చి పూజలు నిర్వహించనున్నారు. దక్షిణ దిశగా కొలువుతీరాల్సిన దక్షిణా మూర్తి తిరువొత్తియూర్‌లోని ఆలయంలో మాత్రం ఉత్తర దిశగా చూస్తూ భక్తులను కటాక్షిస్తుండడం ఈ ఆలయ ప్రత్యేకత. త్యాగరాజస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న దక్షిణామూర్తి ఆలయం ఉత్తర గురుస్థలంగా ప్రసిద్ధిచెందింది. ఒకే రాతిలో 12 అడుగుల భారీ విగ్రహం కలిగిన ఈ ఆలయంలో ఆదిశంకరులు కూడా పూజలు నిర్వహించినట్లు స్థలపురాణం చెబుతోంది. గురుపెయర్చి సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తమ దోషాలు తొలగాలని కోరుకుంటుంటారు. ఈ ఏడాది బుధవారం మధ్యాహ్నం గురుపెయర్చి సందర్భంగా 2.30 గంటల నుంచి గణపతి హోమం, పరిహార హోమం, 108 ఔషధాలు, హోమద్రవ్యాలతో విశేష అభిషేకం, మహా దీపారాధన నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు లక్షార్చన, శుక్రవారం రుద్రాభిషేకం పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈరోడ్ స్ట్రాంగ్ రూమ్ సీసీ కెమెరాలో సాంకేతికలోపం

ప్యారీస్, ఏప్రిల్ 29: నీలగిరి లోక్‌సభ నియోజకవర్గంలోలాగే ఈరోడ్‌లో ఈవీఎం, వీవీ ప్యాడ్‌లు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ సీసీ కెమెరా అర్ధరాత్రి సాంకేతికలోపంతో మొరాయించింది. అప్రమత్తమైన ఎన్నికల టెక్నికల్ విభాగం సిబ్బంది సాంకేతికలోపాన్ని అరగంటలో సరిచేశారు. ఈరోడ్ లోక్‌సభ నియోజకవర్గంలో ఈ నెల 19న జరిగిన పోలింగ్‌లో వినియోగించిన ఈవీఎం, వీవీ ప్యాడ్ తదితరాలను సిత్తోడు ఐఆర్‌టీటీ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచి మూడెంచెల పోలీసు భద్రత ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతంలో ఏర్పాటుచేసిన 220 సీసీ కెమెరాల ద్వారా భద్రతా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఓ సీసీ కెమెరా హఠాత్తుగా మొరాయించింది. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాజగోపాల్ సుంకర సమక్షంలో టెక్నికల్ సిబ్బంది లోపాన్ని సరిచేశారు.

చింత చెట్టును ఢీకొన్న కారు

- తల్లీ, కుమారుడి మృతి

అడయార్, ఏప్రిల్ 29: సేలం జిల్లాలో సోమవారం వేకువజామున జరిగిన కారు ప్రమాదంలో మేట్టూరు థర్మల్ విద్యుత్ కేంద్రానికి చెందిన అధికారిణి సహా ఆమె కుమారుడు దుర్మరణం పాలయ్యారు. వారు ప్రయాణిస్తున్న కారు చింత చెట్టును ఢీకొట్టడంతో ఈ ఘోరం జరిగింది. సేలం జిల్లా మెట్టూరు ప్రాంతానికి చెందిన జయకుమార్ భార్య తమిళరసి (53) థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉన్నతాధికారిగా పని చేస్తున్నారు. వీరి కుమారుడు పుగళ్‌ఒలి (22) సేలంలోని ఒక ప్రైవేటు కాలేజీలో బీటెక్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సేలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను చూసేందుకు తమిళరసి తన కుమారుడితో కలిసి కారులో వెళ్లి తిరిగి అర్ధరాత్రి సమయంలో ఇంటికి బయలుదేరారు. వీరి కారు మెచ్చేరి సమీపంలోని పొట్టనేరి వద్ద వస్తుండగా సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న చింత చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిద్దరూ అక్కడే మరణించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఇద్దరు పిల్లల సహా తల్లి ఆత్మహత్య

అడయార్, ఏప్రిల్ 29: తన ఇద్దరు పిల్లలను బావిలో వేసి, తల్లి కూడా ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన వేలూరు జిల్లాలోని పిచ్చాంతం అనే ప్రాంతంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఈ గ్రామానికి చెందిన సురేష్ (40) చెన్నైలోని ఒక వస్త్ర దుకాణంలో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య పవిత్ర (30), రిత్విక్ (9), రిత్వికా శ్రీ (7) అనే ఇద్దరు పిల్లలున్నారు. వీరంతా చెన్నైలోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల సురేష్ తన భార్యాపిల్లలతో కలిసి సొంతూరు వెళ్లారు. వీరికి సొంతూరులో నాలుగెకరాల వ్యవసాయ భూమితో పాటు బావి కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం తన ఇద్దరు పిల్లలతో కలిసి పొలానికి వెళ్ళిన పవిత్ర పిల్లలను బావిలోకి తోసి, ఆ తర్వాత ఆమె కూడా అందులో దూకి ఆత్మహత్య చేసుకుంది. వీరి మృతదేహాలను అటువైపు వెళ్ళిన స్థానికులు గుర్తించి సురేష్‌కు తెలిపారు. ఆ తర్వాత ఆయన ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

వెళ్ళింయగిరిపై తిరువళ్ళూరు పూజారి మృతి

అడయార్, ఏప్రిల్ 29: కోయంబత్తూరు జిల్లాలోని వెళ్ళియంగిరిపై ట్రెక్కింగ్‌కు వెళ్ళిన తిరువళ్ళూరుకు చెందిన పూజారి ఒకరు మరణించారు. ఈ కొండ ఎక్కేందుకు ప్రయత్నించిన వారిలో ఇప్పటివరకు తొమ్మిది మంది చనిపోయారు. తిరువళ్ళూరు జిల్లా పొన్నేరి తాలూకా, వేలూరు గ్రామం అక్బర్ అంబేడ్కర్ వీధికి చెందిన పుణ్యకోటి (46) అనే పూజారికి భార్య సులోచన , కావ్యప్రియన్, కావ్య అనే ఇద్దరు పిల్లలున్నారు. ఈ నేపథ్యంలో పుణ్యకోటి ఆదివారం ఈ కొండ ఎక్కడం ప్రారంభించాడు. ఒకటో కొండ ఎక్కిన తర్వాత పుణ్యకోటికి శ్వాసపీల్చడంలో సమస్య ఉత్పన్నమయ్యాయి. దీంతో అటవీ సిబ్బంది సాయంతో డోలీలో కిందకు తీసుకొచ్చి 108 అంబులెన్స్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆయన అప్పటికే మరణించినట్టు వైద్యులు వెల్లడించారు. పుణ్యకోటితో కలిపి ఇప్పటివరకు మొత్తం 9 మంది మృత్యువాతపడ్డారు.

వడదెబ్బకు పారాసెట్మల్ ఇవ్వొద్దు

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: వడదెబ్బకు గురైన వారికి పారాసెట్మల్, యాస్ప్రిన్ మాత్రలు ఇవ్వొద్దని కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో వేసవి కారణంగా ఏర్పడే వ్యాధులకు అందించే చికిత్సా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరంలో ఉన్న 140 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 140 సంక్షేమ కేంద్రాలు, 16 సాంఘిక సంక్షేమ కేంద్రాలు, మూడు ప్రసూతి ఆస్పత్రుల్లో 24 గంటలు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నామని తెలిపారు. చెమట ఎక్కువగా ఉంటే లవణాలు ఎక్కువగా కోల్పోయి తలనొప్పి, నీరసం, స్పృహ కోల్పోవడం వంటివి చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వడదెబ్బ తగిలితే వెంటనే వైద్యులను సంప్రదించాలని, పెరాసెటామిల్, యాస్ప్రిన్ మాత్రలు బాధితులకు ఇవ్వరాదని సూచించారు.

జిమ్‌కు వెళ్లొచ్చిన వైద్యుడు గుండెపోటుతో మృతి

పెరంబూర్, ఏప్రిల్ 29: రామనాథపురంలో జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేసి ఇంటికొచ్చిన వైద్యుడు వసంతకృష్ణన్ హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందారు. ఏర్కాడిలోని ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆయన ప్రతిరోజు జిమ్‌కు వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో, జిమ్‌కు వెళ్లి ఇంటికొచ్చిన ఆయన మృతిచెందడంపై పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, ఆయన భార్య ప్రస్తుతం మూడు నెలల గర్భిణి కావడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

వడదెబ్బకు బాలుడి మృతి

వేలూరు, ఏప్రిల్ 29: రాణిపేట జిల్లాలో వడదెబ్బకు 14 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. జిల్లాలో కొద్ది రోజులగా ఎండలు అధికంగా ఉంటున్నాయి. ఈ క్రమంలో, రత్నగిరి సమీపం టీసీ కుప్పం గ్రామానికి చెందిన హర్షన్ (14) తల్లిదండ్రులతో కలసి కొండ ఆలయానికి వెళుతున్న సమయంలో వడదెబ్బకు గురై మృతిచెందాడు.


హర్షన్ (ఫైల్‌ఫొటో)

తెప్పకాడు ఏనుగుల శిబిరంలో పర్యాటకుల సందడి


తెప్పకాడులో ఏనుగుకు ఆహారం తినిపిస్తున్న సిబ్బంది

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని తెప్పకాడు ఏనుగుల శిబిరానికి పర్యాటకుల తాకిడి అధికమైంది. ఆ శిబిరం వద్ద ఏనుగులకు ఉదయం, మధ్యా హ్నం మావటీలు, సంరక్షకు లు ఆహార పదార్థాలను తినిపించడం చూసేందుకు పర్యాటకులు ఆసక్తికనబరుస్తారు. గత మూడు రోజులుగా ఈ శిబిరాన్ని సందర్శించేందుకు వందల సంఖ్యలో పర్యాటకులు వెళ్తున్నారు. ఇక అక్కడికి చేరువగా ఉన్న ముదుమలై పులుల అభయారణ్య ప్రాంతాన్ని సందర్శించేందుకు అటవీశాఖ అధికారులు వాహన సదుపాయం కల్పిస్తున్నారు. ఆ వాహనాల్లో అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో పర్యాటకులు రహదారికి ఇరువైపులా సంచరించే పులులు, ఏనుగులు, జింకలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

- వెనుక అద్దం లేకుండా నడుస్తున్న బస్సు
- నాగపట్టినంలో రవాణా సంస్థ నిర్వాకం


వెనుక అద్దం లేకుండా వెళ్తున్న బస్సు

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినంలో ప్రభుత్వ రవాణా సంస్థకు చెందిన ఓ బస్సు వెనుక అద్దం లేకుండా నడుపుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలాంగన్ని నుంచి నాగపట్టినం వెళ్లే బస్సును మూడు రోజులుగా వెనుకవైపు అద్దం లేకుండా నడుపుతున్నారు. వేలాంగన్ని సముద్రతీర ప్రాంతం కావడంతో బస్సు వెనుక అద్దం లేకపోయినా చల్లగాలులు వీస్తాయి. అయితే వేలాంగన్ని దాటిన తర్వాత ఆ బస్సు వెనుక వైపు ఎండకు ప్రయాణికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంది. రవాణా సంస్థ అధికారులు వెనుక వైపు అద్దం లేకుండా నడుపుత్తున్న బస్సు గురించి పట్టించుకోవడమే లేదని స్థానికులు చెబుతున్నారు. వెనుకవైపు అద్దం లేకుండా వెళ్తున్న ఆ బస్సును కొందరు వీడియో తీసి ప్రసారమాధ్యమాల్లో విడుదల చేశారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోంది.

పదవీవిరమణ చేయనున్న టీచర్లకు సత్కారం


సత్కార కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 29: తమిళనాడు ఉన్నత పాఠశాలల టెక్నికల్ విద్య ఉపాధ్యాయుల సమాఖ్య తరపున మే 31వ తేది పదవీ విరమణ చేయనున్న టెక్నికల్ ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి కడలూరు కార్పొరేషన్ పాఠశాల టెక్నికల్ విద్య ఉపాధ్యాయుడు రవి అధ్యక్షత వహించగా, ప్రధానోపాధ్యాయుడు గుణశేఖర్ ప్రసంగించారు. మొదట సేతియాలోపు డీఏజీఎం కళాశాల టెక్నికల్ విద్య ఉపాధ్యాయుడు కొలంజినాథన్ ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో దిట్టకుడి వి.ప్రభాకరన్, చిదంబరం రవి శంకర్, పాఠశాల విద్యాశాఖ ఉప ఇంజనీర్ మేరీ రాజ్ తదితరులు, పదవీ విరమణ ఉపాధ్యాయులను సత్కరించారు.

వరుణుడి కరుణ కోసం సహస్రనామ పారాయణం


సహస్రనామ పారాయణంలో పాల్గొన్న భక్తులు

వేలూరు, ఏప్రిల్ 29: స్థానిక సత్తువాచేరిలో విష్ణు సహస్రనామ మండలి ఆధ్వర్యంలో సోమవారం విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. కార్యక్రమానికి మండలి అధ్యక్షుడు గణపతి అధ్యక్షత వహించగా, మహిళా విభాగం సెక్రటరీ భానుమతి ఆహ్వానం పలికారు. మండలి గౌరవాధ్యక్షుడు సత్యమూర్తి, మండలి సెక్రటరీ సుబ్రమణి, వేలూరు బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు రాజ తదితరులు పాల్గొన్నారు. ప్రజలంలా క్షేమంగా ఉండాలని, వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో మండలి సభ్యులు రాజ్యలక్ష్మి, రాఘవేంద్రన్, మాలతి, సత్యమూర్తి, పద్మ, విద్య, రాజేశ్వరం, మరకదం రాజ, లక్ష్మీ నారాయణన్, అరుణాచలం, నిర్మల పురుషోత్తమన్ తదితరులు పాల్గొన్నారు.

ఊటీ, కొడైకెనాల్ వెళ్లే పర్యాటకులకు ఈ-పాస్

- మద్రాసు హైకోర్టు

ప్యారీస్, ఏప్రిల్ 29: రాష్ట్రంలో వేసవి విడిది ప్రాంతాలైన ఊటీ, కొడైకెనాల్ వెళ్లే పర్యాటకులకు మే 7 నుంచి జూన్ 30వ తేది వరకు ఈ-పాస్ విధానం అమలుపరచాలని నీలగిరి, దిండుగల్ జిల్లాల కలెక్టర్లకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ-పాస్‌కు సంబంధించిన సాంకేతిక సహాయాన్ని రాష్ట్రప్రభుత్వం అందించాలని హైకోర్టు సూచించింది. ఈ-పాస్ విధానంలో నీలగిరి, దిండుగల్ జిల్లాల ప్రజలకు మినహాయింపు ఇవ్వాలని, దీనిపై దేశవ్యాప్తంగా విస్తృత ప్రకటన చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఎండలు మండుతున్న నేపథ్యంలో, వేసవి విడిది ప్రాంతాల్లో రద్దీని నివారించే దిశగా ఈ చర్యలు చేపట్టినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

కొలనులో మునిగి యువకుడి మృతి

ప్యారీస్, ఏప్రిల్ 29: స్థానిక తిరుపోరూర్ కందస్వామి ఆలయ కొలనులో క్రోంపేటకు చెందిన ఆనందబాబు (30) స్నానం చేస్తూ నీటమునిగి మరణించాడు. కారు డ్రైవర్‌గా పనిచేసే ఆనందబాబు శనివారం తన మిత్రులతో కలసి ఈ ఆలయానికి వెళ్లి శిరోముండనం చేయించుకొని స్నానమాచరించేందుకు కొలనులో దిగారు. కొద్దిసేపటికి కొలను మధ్య ప్రాంతానికి ఈదుకుంటూ చేరుకున్న ఆనందబాబు ఊపిరాడక నీటమునిగినట్లు తెలిసింది. అతడిని కాపాడేందుకు మిత్రులు చేపట్టిన ప్రయత్నాలు ఫలించలేదు. దీనిపై అందజేసిన సమాచారంతో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆనందబాబు శవాన్ని బయటకు తీశారు. తిరుపోరూర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం...

- 8 మంది అరెస్టు

పెరంబూర్, ఏప్రిల్ 29: ఐపీఎల్ పోటీల్లో భాగంగా స్థానిక చేపాక్కం క్రికెట్ మైదానంలో ఆదివారం రాత్రి చెన్నై సూపర్ కింగ్స్-సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయం ఆన్‌లైన్‌లో ప్రారంభమైన పది నిమిషాల్లోపే అయిపోయాయి. టిక్కెట్లు లభించని అభిమానులు ఎలాగైనా మ్యాచ్ చూడాలని స్టేడియం వద్దకు చేరుకున్నారు. వారి ఆసక్తిని గమనించి పలువురు అధిక ధరలకు టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న 8 మందిని అరెస్ట్ చేసి, 26 టిక్కెట్లు, రూ.72,242 నగదు స్వాధీనం చేసుకున్నారు.

తాగునీటి కోసం ప్రజల రాస్తారోకో


ప్రభుత్వ బస్సును అడ్డుకుంటున్న గ్రామస్తులు

పెరంబూర్, ఏప్రిల్ 29: కళ్లకుర్చి జిల్లా చిన్నసేలం సమీపంలోని తిమ్మయాపురం గ్రామంలో మరమ్మతులకు గురైన మోటారుకు సత్వరం మరమ్మతులు చేసి తాగునీరందించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం రాస్తారోకో చేశారు. అలాగే, పొల్లాచ్చి సమీపం సుందరగౌండనూరు, మరంపిడుంగి గౌండనూరు తదితర గ్రామాల్లో రెండు వారాలుగా తాగునీరు అందించడం లేదని, ఈ విషయమై అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోయిందని ఆరోపిస్తూ ఆ గ్రామాల ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి ప్రజలతో చర్చించి సమస్యను సత్వరం పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళనలు విరమించారు.

చిత్రజ్యోతి

16న 'ఇండియన్-2' ఆడియో రిలీజ్

విశ్వనటుడు కమల్ హాసన్, సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'ఇండియన్-2' చిత్రం ఆడియో రిలీజ్ వేడుక మే 16వ తేదీన జరుగనుంది. పెరియమేడులోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ ఆడియో రిలీజ్ వేడుకను గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆడియో రిలీజ్ కార్యక్రమానికి సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో సహా అనేక మంది సినీ ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఈ సినిమాలోని ఒక పాటను సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ ఆలపించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇందులో కమల్‌తో పాటు కాజల్ అగర్వాల్, ప్రియ భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా, సముద్రఖని వంటి అనేక మంది నటీనటులు నటించారు.



'ఇండియన్-2'లో కమల్‌హాసన్



'పడిక్కాద పక్కంగల్' ఆడియో రిలీజ్ దృశ్యం

సంగీతం గొప్పదా? భాష గొప్పదా?

● ప్రశ్నించిన వైరముత్తు

సంగీతం గొప్పదా? భాష గొప్పదా? అంటూ ప్రముఖ గేయ రచయిత వైరముత్తు ప్రశ్నించారు. ముత్తుకుమార్ నిర్మాణంలో సెల్వం పద్మనాభన్ దర్శకత్వం వహించిన చిత్రం 'పడిక్కాద పక్కంగల్' చిత్రం ఆడియో నగరంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైరముత్తు మాట్లాడుతూ 'ఒక పాటలో సంగీతం గొప్పదా? భాష గొప్పదా? అనేది ఇపుడు పెద్ద చర్చనీయాంశంగా మారిందని, సంగీతం ఎంత గొప్పదో.. భాష కూడా అంతే గొప్పదని, భాష ఎంత గొప్పదో.. సంగీతం కూడా అంతే గొప్పదని.. ఈ రెండూ కలిస్తేనే పాటగా మారుతుందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో భాష కంటే సంగీతం గొప్పదిగా, మరికొన్ని సందర్భాల్లో భాష గొప్పదిగా ఉన్నట్టు కనిపిస్తుందని ఈ విషయాన్ని గ్రహించి, అర్థం చేసుకున్నవారే జ్ఞానులన్నారు. పాటకు పేరు పెట్టేది భాషనా? లేక సంగీతమా? అంటే పాటకు పేరు పెట్టేది భాష మాత్రమేనని, దానికి అందం, అభినయం చేకూర్చిపెట్టేది సంగీతం. ఈ విషయాన్ని విస్మరించలేమని, సంగీతం, భాష రెండు పరస్పరం సమ్మేళనం అయితేనే కళ అభివృద్ధి చెందుతుని తాను బలంగా నమ్ముతానన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు ప్రిజన్, సంగీత దర్శకుడు సిర్పి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌రాజ్‌కు 'అంబేడ్కర్ అవార్డు'

రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీల్లో ఒకటైన విడుదలై చిరుత్తైగల్ కట్చి (వీసీకే) ప్రతి యేటా ప్రదానం చేసే అవార్డుల్లో ఈ యేడాది 'అంబేడ్కర్ అవార్డు'ను ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్‌కు ప్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తొల్ తిరుమావళవన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పార్టీ ప్రతి యేటా సమాజసేవ, రాజకీయం, సంస్కృతి, సాహిత్యం వంటి రంగాల్లో సేవ చేసినవారికి 'అంబేడ్కర్, పెరియార్, కామరాజర్, అయోధ్య దాసర్, ఖాయిదేమిల్లత్ వంటి మహనీయుల పేరు మీద అవార్డులను అందచేస్తోంది. ఈ నేపథ్యంలో 2024 సంవత్సరానికిగాను 'అంబేడ్కర్ జ్యోతి' అవార్డును ప్రకాష్ రాజ్‌కు ప్రకటించారు. సినీ కళాకారుడు, సెక్యులరిజం కోసం రాజీలేని పోరాటంచేసే యోధుడిగా గుర్తిస్తూ ఈ అవార్డును ప్రకటిస్తున్నట్టు తిరుమావళవన్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.





నటి రాధ

'సుందర ట్రావెల్స్' హీరోయిన్‌పై ఫిర్యాదు

ఆర్థికలావాదేవీల వ్యవహారంలో మురళి అనే వ్యక్తిపై దాడి చేసిన సంఘటనకు సంబంధించి 'సుందర ట్రావెల్స్' చిత్రం హీరోయిన్ రాధపె వడపళని పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో నటి రాధను స్టేషన్‌కు పిలిచి పోలీసులు విచారణ జరుపుతున్నారు. స్థానిక నెర్కుంద్రం ప్రాంతానికి చెందిన మురళి అనే వ్యక్తిపై నటి రాధ దాడి చేయడంతో రాయపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆ దాడి సంఘటన గురించి ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మార్చిలో కూడా ఫ్రాన్సిస్ అనే యువకుడిపై దాడి చేసిన కేసులోను నటి రాధ, ఆమె కుమారుడు తరుణ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఊటీలోనూ మండుతున్న ఎండలు



చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అగ్ని నక్షత్రం ప్రారంభం కాకమునుపే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతంలో ఊటీలోనూ గత రెండు రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రత అధికమై స్థానికులను ముప్పుతిప్పలు పెడుతోంది. ఊటీలో ఫల పుష్ప ప్రదర్శనకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఉన్నట్టుండి ఆ ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 29 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణ స్థాయి కంటే 5.4 డిగ్రీల సెల్సియస్ అధికమని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు. మే మొదటివారం తర్వాత పగటిపూట ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, అయితే ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే వేసవిలో ఊటీలో పెరిగే ఉష్ణోగ్రత తక్కువగానే ఉంటుందని వివరించారు.

జీఎల్ఎస్ కబడ్డీ విజేత సెయింట్ జోసఫ్ కాలేజ్



ప్యారీస్, ఏప్రిల్ 29: నగరంలోని సెయింట్ జోసఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ జీఎల్ఎస్ కబడ్డీ టోర్నమెంట్ విజేతగా నిలిచింది. చెంగల్పట్టులో జీఎల్ఎస్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ఐదు రౌండ్లు నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ టోర్నీలో 24 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో చెంగల్పట్టు జీఎల్ఎల్ టీమ్‌ను మట్టికరిపించిన సెయింట్ జోసఫ్ కాలేజ్ ఇఫ్ ఇంజనీరింగ్ జట్టు ట్రోఫీని సొంతం చేసుకుంది. సోమవారం ఈ జట్టును సంస్థ ఛైర్మెన్ డా.బాబూ మనోహరన్, మేనేజింగ్ డైరెక్టర్ శశికుమార్, కోచ్‌లు అభినందించారు.



టి.నగర్ ఉస్మాన్‌రోడ్డులో ఆధునిక వంతెన నిర్మాణ పనుల కోసం నార్త్ ఉస్మాన్‌రోడ్డులో వున్న వంతెనను తాత్కాలికంగా మూసివేసిన దృశ్యం



రాయపేటలో చలివేంద్రాన్ని ప్రారంభించి పుచ్చకాయ ముక్కలను పంపిణీ చేస్తున్న టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ తదితరులు

పొల్లాచ్చి కొబ్బరిబోండాలకు డిమాండ్

● టన్ను రూ.15,500లు



చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మేలి రకం కొబ్బరి బోండాలకు పేరొందిన పొల్లాచ్చిలో ఈ యేడాది కొబ్బరి తోటల్లో దిగుబడి విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం రాష్ట్రవంతా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు కొబ్బరి నీళ్లను తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో పొల్లాచ్చి మార్కెట్ నుంచి టన్నుల కొద్దీ కొబ్బరి బోండాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకే కాకుండా పొరుగు రాష్ట్రమైన కేరళకు కూడా సరఫరా చేస్తున్నారు. పొల్లాచ్చి ఆనమలై తాలూకా పెద్ద మార్కెట్‌లో కొబ్బరి బోండాల ధర టన్ను రూ.15,500లుగా నిర్ణయించారు. ఈ కొబ్బరి బోండాలను చిల్లర వ్యాపారులు ఒక్కో కొబ్బరి బోండాం రూ.35 నుంచి రూ.40లకు విక్రయిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో కొబ్బరి బోండాల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని పొల్లాచ్చి కొబ్బరి బోండాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు చెబుతున్నారు.

గిండి స్నేక్ పార్క్‌లో 'ఏఆర్ త్రీడీ' సౌకర్యం

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: స్థానిక గిండి స్నేక్ పార్క్‌లో వన్యమృగాలను దగ్గర నుంచి తాకి చూసిన అనుభూతిని కలిగించే త్రీడీ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేశారు. ఇక్కడ 32 జాతులకు చెందిన 300లకు పైగా సరీసృపాలున్నాయి. పాముల గురించి తెలుసుకొనేలా ఫొటో ఎగ్జిబిషన్, ఆడిటోరియం ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. త్వరలో 'అనకొండ' రకం పాములను సందర్శనకు ఉంచనున్నారు. ఈ క్రమంలో, అడవి జంతువులను స్పృశిస్తే కలిగే అనుభూతిని కలిగించే త్రీడీ సాంకేతిక ప్రదర్శన ఏర్పాటుచేశారు. అందులో వీఆర్ త్రీడీ విజ్యువల్ రియాల్టీ షో, డైనోసార్ వరల్డ్ తదితర ప్రదర్శనలు వీక్షించవచ్చు. 5నుంచి 7 నిమిషాలు సాగే ప్రదర్శనకు రూ.100 వసూలుచేస్తున్నారు.

పెరిగిన బీరు విక్రయాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: మద్యం దుకాణాల్లో బీరు విక్రయాలు పెరిగినట్లు టాస్మాక్ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో ఎండ తీవ్రత కారణంగా మద్యం ప్రియులు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు బీరు తీసుకుంటున్నారు. ఈ విషయమై టాస్మాక్ అధికారులు మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సెలవులు కారణంగా విక్రయాలు మందకొడిగా సాగాయని, ప్రస్తుతం మద్యం కన్నా బీరు విక్రయాలు పెరిగాయన్నారు. దీంతో, అదనంగా బీరు సీసాలు పంపిస్తున్నామని, మేలో విక్రయాలు మరింత పెరిగే అవకాశముందని తెలిపారు.

అగ్ని కాలేజీలో 'స్కిల్ బ్రిడ్జ కాన్‌క్లేవ్'



స్కిల్ బ్రిడ్స్ కాన్‌క్లేవ్‌లో విద్యాప్రముఖులు

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'అగ్ని' కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన స్కిల్ బ్రిడ్జ్ కాన్‌క్లేవ్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో అగ్ని గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ ఆర్ఎన్ జయప్రకాష్, ఛైర్‌పర్సన్ భవానీ జయప్రకాష్, ప్రొఫెసర్ టీఎస్ నటరాజన్, గరుడ ఏరోస్పేస్ సీఈవో డాక్టర్ విజయ కుమార్, కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాసన్ ఆలవందర్ తదితరులు హెచ్ఆర్‌డీ నిపుణులకు తమ సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా హెచ్ఆర్ ప్రొఫెషనల్స్, ఇండస్ట్రీ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ... తమిళనాడులో అందిస్తున్న నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాల అభివృద్ధికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.

ఫీనిక్స్ మార్కెట్‌లో సాలిటారియో షోరూం



షోరూం ప్రారంభోత్సవంలో నటి ప్రియమణి

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్ సిటీలో సాలిటారియో వజ్రాల షోరూం ఏర్పాటైంది. ప్రముఖ సినీ నటి ప్రియమణి ఆదివారం ఈ షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. ఇది ఈ సంస్థ 15వ షోరూం కాగా, చెన్నైలో మొట్టమొదటిది కావడం విశేషం. ఈ సందర్భంగా సంస్థ సీఈవో రికీ వసందాని మాట్లాడుతూ... విలాసవంతమైన, స్టైల్‌కు ప్రసిద్ధ చెందిన చెన్నైలో తమ మొదటి స్టోర్ ఆవిష్కరించడం సంతోషంగా వుందన్నారు. అత్యాధునిక డిజైన్లతో రూపొందిన వజ్రాల నగలు తమ వినియోగదారులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తాయని వివరించారు.

రూ.4 కోట్లు స్వాధీనం కేసులో... సీబీసీఐడీకి ఆధారాల సమర్పణ

అడయార్, ఏప్రిల్ 29: స్థానిక తాంబరం రైల్వే స్టేషన్‌లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్న వ్యవహారంలో బీజేపీ నేత నయినార్ నాగేంద్రన్ సహా నలుగురిపై కేసు నమోదు చేయగా, ఈ కేసును సీబీసీఐడీకి బదిలీ చేశారు. ఈ కేసులో పోలీసులు సేకరించిన అన్ని ఆధారాలను సీబీసీఐడీకి సమర్పించారు. గత నెల 26న తాంబరం రైల్వే స్టేషన్‌లో రూ.4 కోట్ల నగదును ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. లెక్కల్లోచూపని, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఈ నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు నెల్లై బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌కు చెందిన హోటల్ మేనేజర్, బీజేపీ నేత సతీష్, నవీన్, పెరుమాళ్ అనే వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వీరిని విచారించగా ఈ నగదును చెన్నై నుంచి తిరునెల్వేలికి తీసుకెళుతున్నట్టు వారు వెల్లడించారు. వారిచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ నగదు రవాణాకు సంబంధించి వివరణ ఇవ్వాలని నయినార్ నాగేంద్రన్‌కు పోలీసులు నోటీసులివ్వగా, ఈ డబ్బుకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సతీష్, నవీన్, పెరుమాళ్ ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా రూ.4 కోట్లకు సంబంధించి పలువురు ప్రముఖులకు సంబంధం ఉన్నట్టు గుర్తించారు. అదేసమయంలో ఈ కేసు విచారణను తాంబరం పోలీసుల నుంచి సీబీసీఐడీకి బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఆదేశించారు. దీంతో అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాత ఈ కేసుతో సంబంధం ఉన్న ప్రముఖులు నోటీసులిచ్చి, మరిన్ని వివరాలు రాబట్టేందుకు సీబీసీఐడీ అధికారులు రంగంలోకి దిగనున్నారు.

నేడు వేదారణ్యంలో ఉప్పు సత్యాగ్రహ ర్యాలీ

అడయార్/పెరంబూర్, ఏప్రిల్ 29: వేదారణ్యంలో మంగళవారం ఉప్పు సత్యాగ్రహ ర్యాలీ జరుగనుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆంగ్లేయుల పాలనలో ఉప్పుపై పన్ను వేయగా దీన్ని వ్యతిరేకిస్తూ 1930 సంవత్సరం ఏప్రిల్‌లో గుజరాత్ రాష్ట్రంలోని దండి నుంచి మహాత్మా గాంధీ ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. అదే రోజున రాజాజీ సారథ్యంలో తిరుచ్చి నుంచి వేదారణ్యం వరకు ఈ ర్యాలీ చేపట్టారు. ఈ పోరాటాన్ని గుర్తు చేసుకునే విధంగా మంగళవారం వేదారణ్యంలో ఉప్పు సత్యాగ్రహ ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ఉప్పు సత్యాగ్రహ స్మారక ర్యాలీలో 50 మందికిపైగా స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొననున్నారు. తిరుచ్చిలో ప్రారంభమయ్యే ఈ యాత్ర వేదారణ్యంలోని అగ్నియంపల్లి బీచ్ వరకు కొనసాగుతుంది. ఇదే విషయంపై మైలాడుదురై మాజీ ఎంపీ రాజేంద్రన్ మాట్లాడుతూ ... ఉప్పు సత్యాగ్రహ పోరాట స్మారక ర్యాలీ మంగళవారం ఉదయం 6.30 గంటకు వేదారణ్యంలోని స్మారక స్థూపం నుంచి ప్రారంభమై అగస్తియన్‌పల్లి వరకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, మాజీ కేంద్ర మంత్రి తంగబాలు, స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రన్ మనవడు వేదరత్నం సహా వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. 5 కి.మీ దూరం ఉన్న వేదారణ్యం నుంచి అగస్తియంపల్లి వరకు వెళ్లి ఉప్పు సత్యాగ్రహ స్థూపం సమీపంలో ఉప్పు పిడికెళ్లలో తీసుకొనే కార్యక్రమం చేపట్టనున్నామని ఆయన తెలిపారు.



వేదారణ్యంలోని ఉప్పు సత్యాగ్రహ స్మారక స్థూపం

కత్తిపార జంక్షన్‌లో రెండో విడత మెట్రో పనులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 29: స్థానిక గిండి కత్తిపార జంక్షన్‌లో విమాన రన్‌వేకు ఎలాంటి నష్టం కలిగించని విధంగా రెండో విడత మెట్రో పనులు చేపట్టినట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. నగరంలో రెండో విడత మెట్రోరైలు పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో ఐదవ మార్గమైన 47 కి.మీ మాధవరం-షోలింగనల్లూర్ మెట్రో పనులు జరుగుతున్నాయి. ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారులు మాట్లాడుతూ... మాధవరం-షోలింగనల్లూర్ మార్గం గిండి కత్తిపార జంక్షన్ మీదుగు వెళ్తుందని, ఇదివరకే ఉన్న మొదటి విడత మెట్రోరైలు పథకం గిండి దక్షిణ రైల్వేస్టేషన్, విమానాశ్రయం సమీపంలో ఉండడంతో దాని సమీపంలో రెండో విడత పనులు ప్రారంభించామన్నారు. ఈ పనులు ద్వారా రైలు మార్గం కానీ, విమాన రన్‌వే కానీ దెబ్బతినవని అధికారులు తెలిపారు.

జన కేతనం



బరిలో వీరు



సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరనేది సోమవారం సాయంత్రానికి లెక్క తేలింది.తిరుపతి లోక్‌సభ స్థానానికి 23మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది పోటీలో మిగిలారు.అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నుంచీ 46 మంది పోటీలో వుండగా, చంద్రగిరిలో 24 మంది, శ్రీకాళహస్తి, సత్యవేడుల్లో 15 మంది చొప్పున, గూడూరు నుంచీ 14 మంది, వెంకటగిరి నుంచీ పది మంది, సూళ్ళూరుపేట నుంచి తొమ్మిది మంది పోటీలో వున్నారు.సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ నేత జేడీ రాజశేఖర్ ఆ పార్టీ రెబెల్ అభ్యర్థిగా బరిలో నిలవడం పార్టీ వర్గాల్లో కలకలం సృష్టించింది. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 46 మంది అభ్యర్థులు బరిలో వుండగా ప్రధాన రాజకీయ పక్షాలైన జనసేన, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ వంటి నాలుగైదు పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన వారంతా గుర్తింపు లేని పార్టీల తరపున, ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారే. జిల్లాలో మరెక్కడా లేని విధంగా ఇక్కడే ఎందుకు ఇంతమంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో వున్నారన్న ప్రశ్న పలువురిలో తలెత్తుతోంది. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఇక ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

తిరుపతి (ఎంపీ)

బీజేపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
వి. వరప్రసాదరావు	మద్దిల గురుమూర్తి	చింతా మోహన్	బీఎస్పీ: పెనుమూరు గుర్రప్ప; లిబరేషన్ కాంగ్రెస్: విజయకుమార్; ఎస్పీ: వేలూరు తేజోవతి; మొత్తం: 23 మంది

తిరుపతి (అసెంబ్లీ)

జనసేన	వైసీపీ	సీపీఐ	ఇతరులు
ఆరణి శ్రీనివాసులు	భూమన అభినయ్	పి.మురళి	బీఎస్పీ: జె.వేణుగోపాలరాజు; ఎస్పీ: శ్రీనివాస్ కుమార్ గొర్ల; మొత్తం: 46 మంది

శ్రీకాళహస్తి

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బొజ్జల సుధీర్‌రెడ్డి	బియ్యపు మధు	పోతుగుంట రాజేష్	స్వతంత్రులు: 5; బీఎస్పీ: సురేంద్రబాబు; నేషనలిస్ట్ జనశక్తి: గానుగపెంట రమేష్; ఎస్పీ: గోవిందస్వామి; మొత్తం: 15 మంది

చంద్రగిరి

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
పులివర్తి నాని	చెవిరెడ్డి మోహిత్ రెడ్డి	కె.శ్రీనివాసులు	లిబరేషన్ కాంగ్రెస్: కె.ఈశ్వరయ్య; జైభారత్ నేషనల్ పార్టీ: తురకా అమరనాథ్; మొత్తం: 24 మంది

సత్యవేడు

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
కోనేటి ఆదిమూలం	నూకతోటి రాజేష్	బాలగురవం బాబు	స్వతంత్రులు: 9; బీఎస్పీ: సుప్రియ; లిబరేషన్ కాంగ్రెస్: విజయకుమార్; జైభారత్ నేషనల్ పార్టీ: కిరణ్; మొత్తం: 15 మంది

నగరి

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
భానుప్రకాష్	ఆర్కే రోజా	రాకేష్ రెడ్డి	స్వతంత్రులు ముగ్గురు; నవరంగ్ కాంగ్రెస్: జ్ఞానప్రకాష్‌రెడ్డి; మొత్తం: 9 మంది

సూళ్లూరుపేట


టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
నెలవల విజయశ్రీ	కిలివేటి సంజీవయ్య	చందనమూడి శివ	స్వతంత్రులు: 3; బీఎస్పీ: తొప్పాని రమణయ్య; లిబరేషన్ కాంగ్రెస్: కందాటి రజనీకాంత్; ఎస్పీ: బి. శ్రీనివాసులు; మొత్తం: 9 మంది

వెంకటగిరి

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
కురుగొండ్ల రామకృష్ణ	ఎన్.రాంకుమార్	పి.శ్రీనివాసులు రెడ్డి	స్వతంత్రులు: 2; బీఎస్పీ: జయచంద్ర; జైభారత్ పార్టీ: శ్రీరామరాజు; బీసీవై: సీహెచ్. శివకృష్ణ; మొత్తం: 10 మంది

గూడూరు

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
పాశిం సునీల్‌కుమార్	మేరిగ మురళీధర్	యు.రామకృష్ణారావు	స్వతంత్రులు: 6; బీఎస్పీ: అన్నెం మల్లికార్జున్; ఎస్పీ: సునీల్‌రాజు; ఐబీపీ: రమేష్‌బాబు; పిరమిడ్ పార్టీ: పోలమ్మ; మొత్తం: 14 మంది




అన్ని హామీల తరహాలోనే జగన్ నిమ్మ రైతులకిచ్చిన మాట కూడా అటకెక్కేసింది. ఐదేళ్ల పాలనలో నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకుండి పోయారు. కోల్డ్ స్టోరేజిల మాట దేముడెరుగు.. కనీసం గిట్టుబాటు ధర ఊసు కూడా లేకుండా పోయింది. పైగా అప్పటి దాకా ఉన్న పథకాలకు జగన్ జమానాలో తిలోదకాలిచ్చేశారు. ఎరువులు, పురుగుమందులు, నర్సరీల మంజూరు, ఆధునిక యాంత్రీకరణ పనిముట్లు, ఉద్యాన పంటల పెరుగుదలకు రుణసాయం.... ఇలా అన్ని ప్రోత్సాహకాలకూ జగనన్న మంగళం పాడేశారు. దీంతో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో నిమ్మరైతాంగం వెన్నువిరిచినట్లైంది. వేసవి కాలంలో తప్ప మిగిలిన సీజన్లలో కనీసం కూలి కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతుల బాధలు దారుణంగా ఉన్నాయి.


నిమ్మమార్కెట్‌లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న నిమ్మబస్తాలు

గూడూరులో అన్ సీజన్‌లో 80 కిలోల నిమ్మకాయల బస్తా రూ.500 కూడా అమ్మడం లేదు. రేపు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం రూ.2000 గిట్టుబాటు ధర కల్పిస్తా... అంతేకాదు.. నిమ్మపంట నిల్వ చేసుకునేందుకు కోల్డ్‌స్టోరేజీ యూనిట్లను ఏర్పాటు చేస్తా...

2018 జనవరి 29న ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సైదాపురం వద్ద నిమ్మరైతులకు జగన్ ఇచ్చిన హామీ ఇది... ప్రస్తుత రేటెలా వున్నా రెండు మూడు నెలల్లో అన్‌సీజన్ ప్రారంభం కాగానే బస్తా ఐదారు వందల రూపాయలకు పడిపోతుందని నిమ్మరైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదేనా జగన్ మాకు చేసిన మేలు అని వారు ప్రశ్నిస్తున్నారు.



నిమ్మకు

- గిట్టుబాటు ధర గాలికి
- అతీగతీ లేని కోల్డ్‌స్టోరేజీల యూనిట్ల హామీ
- ఐదేళ్లలో రైతు సంక్షేమం ఊసేలేదు

నీరెత్తిపోయావేందన్నా...?

తగునా జగనా...

సుమారు 10వేల హెక్టార్లలో సాగవుతున్న నిమ్మపంటపై వేలాది రైతు కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. పరోక్షంగా వ్యవసాయ కూలీలు, ఆటో యజమానులు, వ్యాపారులు కూడా లబ్ధి పొందుతున్నారు. గూడూరు, జయంపు, పొదలకూరు మార్కెట్ సముదాయాలలో వారంలో ఆరు రోజుల పాటు క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. రోజూ సుమారు 200 మెట్రిక్ టన్నులకు పైగా మార్కెట్ల నుంచి దేశం నలుమూలలా ప్రధాన నగరాలకు నిమ్మకాయలు రవాణా అవుతుంటాయి. ఏడాది పొడవునా స్థిరంగా గిట్టుబాటు ధర ఉండటం లేదు. నిల్వ చేద్దామంటే శీతల గిడ్డంగులు లేవు. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిమ్మరైతులు ఆక్రోశిస్తున్నారు. ఈ క్రమంలోనే గత సార్వత్రిక ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్షనేత జగన్ గూడూరు మీదుగా వచ్చారు. ఆయనకు అన్నదాతలు తమ గోడు విన్నవించారు. వెంటనే జగన్ స్పందించి వారి కోరికలన్నీ నెరవేర్చుతానన్నారు. అధికారంలోకి వచ్చాక ఈ హామీల ప్రస్తావనే చేయలేదు. నిమ్మకు నీరెత్తినట్లుండి పోయారని రైతులు వాపోతున్నారు.

- గూడూరు అర్బన్

చేప్తే చేస్తాడనుకున్నాం



ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన ధర ఇవ్వకుంటే ఎట్టాగయ్యా.. ఎన్నికల ముందేమో మంచి ధర వచ్చేటట్టు చూస్తాడని చేప్తే నమ్మాం. జగన్ ముఖ్యమంత్రయ్యాక నిమ్మకు నీరెత్తి పోతాడనుకోలా.. ఈ జన్మలో జగన్ మాటలు నమ్మం.

- మాగుంట విజిత్‌కుమార్‌రెడ్డి, రైతు, గూడూరు

శీతల గిడ్డంగులకు ప్రయత్నాలేవి



నిమ్మపంటతో వేలాది కుటుంబాలు బతుకుతున్నాయి. ధరలు స్థిరంగా లేకపోవడంతో రైతుతో పాటు అందరూ నష్టపోతున్నాం. శీతల గిడ్డంగులు (కోల్డ్‌స్టోరేజీలు), విరివిరిగా ఏర్పాటు చేస్తే అందరం బాగుపడతాం. దురదృష్టవశాత్తూ ఇప్పటి దాకా అలాంటి ప్రయత్నాలేవీ ప్రభుత్వం చేయలేదు.

- దందోలు రఘుప్రసాద్‌రెడ్డి. నిమ్మ వ్యాపారి

ఉత్తరాదిలో డిమాండ్ ఉంటేనే ధరలు



ఉత్తర భారత రాష్ట్రాలలో డిమాండ్‌ను బట్టి ఇక్కడ రేట్లు ఉంటాయి. అక్కడ వర్షాకాలం, వంచు కాలంలో డిమాండ్ తగ్గుతుంది. కాబట్టి రేట్లు పలకవు. ప్రభుత్వమే చొరవ చూపి ధరలస్థిరీకరణపై ప్రణాళికలు తయారుచేసి అమలు చేయాలి.

- దొడ్డగ భాస్కర్‌రావు, నిమ్మ ఎగుమతిదారుడు

ఇదీ మందు

90 వేలు మెజారిటీ గ్యారెంటీ

'అన్నా.. నీ ఓటు నాకే. వణక్కం అక్కా.. నాకే గదా!' అంటూ సత్యవేడు ప్రాంతంలో ఒకాయన ఎడాపెడా తిరిగేస్తున్నాడు. టీయంగడి దగ్గర నిలబడివున్న గుంపులోని ఒక పెద్దాయన అతన్ని పిలిచి, 'ఎవురు సామీ నువ్వు.. యే పార్టీ' అంటూ పలకరించాడు. 'ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశాను.' అంటూ అతను బదులిచ్చాడు. 'ఎండనబడి తిరగతావుండావు. పెద్ద పెద్ద పార్టీలవోళ్లే కొట్టుకులాడతావుంటే నడిమద్దెన నువ్వు గెలిచేదేనా అబయా.. ఎందుకీ యాసండం పాపం నీకు' అంటూ పెద్దాయన సానుభూతితో మంచి మాటలు చెప్పాడు. 'చూస్తావుండు పెద్దాయనా.. 90 వేల మెజారిటీతో గెలవబోతా వుండా.. గ్యారెంటీ.. రాసుకో కావాలంటే' అని అతను సవాలు కూడా విసిరాడు. ఏందిరా సామీ ఈ మనిషి దైర్నెం అని అక్కడ ఉన్నోళ్లంతా ఆశ్చర్యపడిపోతా ఉంటే, 'జాతకం చూపించుకున్నా.. 90 వేలు గ్యారెంటీ అని చెప్పినారు. దిగుల్లేదు బొంది' అని చెప్పి అతను మరొకర్ని ఓటడగడానికి వెళ్లిపోయాడు. తాగుతున్న టీ గుటకేసేది కూడా మరిచిపోయి అక్కడున్నోళ్లు వెళ్లిపోతున్న అతనివైపు జాలిగా చూస్తూ ఉండిపోయారు.

- సత్యవేడు



నోట్ దిస్ పాయింట్

రౌడీలూ.. జాగ్రత్త!

నేరచరిత్రగల వ్యక్తులపై ఎన్నికల సమయంలో ప్రత్యేక నిఘా ఉంటుంది. రౌడీషీట్ ఉన్నవారిని బైండోవర్ చేస్తున్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించబోను అంటూ నేరచరిత్ర ఉన్నవారి దగ్గర ఒక బాండ్ రాయించుకోవడాన్ని బైండోవర్ అంటారు. భారతీయ నేర శిక్షాస్మృతిలోని 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్ కేసులు నమోదు చేస్తారు. బాండ్ సమర్పించిన తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తారు. ఇది రాసిచ్చిన రోజు నుంచి ఆరు నెలల పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. నేరం చేసినా, కేసు నమోదైనా 24 గంటల్లో అరెస్టు చేస్తారు. హామీపత్రంలో పేర్కొన్న నగదు మొత్తాన్ని వసూలు చేస్తారు. పదే, పదే కేసులు నమోదై ఎన్నికల సమయంలో గలాటాలు, ఘర్షణలకు పాల్పడితే ఆస్తులు కూడా జప్తు చేసే అధికారం ఎన్నికల అధికారులకు ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి తిరుపతి జిల్లాలో ఇప్పటివరకూ 753 బైండోవర్ కేసులు నమోదు చేశారు. గత రెండు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్ద హింసకు పాల్పడిన వారి కదలికలపై ఇప్పటినుంచే నిఘా పెట్టారు.

- తిరుపతి(నేరవిభాగం)

ఓటు అమ్ముకున్న వారు శవంతో సమానం

ఓటు అమ్ముకున్న వారు శవంతో సమానం. సొమ్మున్న సోగ్గాళ్ళ గేమ్‌గా నడుస్తున్న ఈ ఎన్నికల్లో ఓటరు నీతిమంతంగా ఉంటే నేతలూ మారతారంటూ జై భారత్ సంస్థ ప్రచారం చేస్తోంది. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆ సంస్థ జాతీయ నేత లోకనాథ్‌తో పాటు పలువురు ప్రతినిధులు సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)

